మనం
కడప | అన్నమయ్య





ఈ నెల 5 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రొద్దుటూరు పర్యటన నేపథ్యంలో బహిరంగ సభా స్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి
- అక్టోబర్ 4 మనంన్యూస్









# పల్లె ముంగిటకు గంగమ్మ..!

**ప్రొద్దుటూరు వేదికగా 'అమరజీవి జలధార'కు నేడు అంకురార్పణ**

**రూ.30,156 కోట్లతో జలజీవన్ మిషన్ పనులకు రాష్ట్ర స్థాయి శ్రీకారం**

**పైలాన్ ఆవిష్కరించి శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**27.36 లక్షల కొత్త కుళాయిలు.. 3.27 కోట్ల మందికి చేకూరనున్న మేలు**

మనం ప్రతినిధి కడప అక్టోబర్ 4:
రాష్ట్రంలోని మారుమూల పల్లెల్లో తాగునీటి ఎద్దడికి శాశ్వత చరమగీతం పాడుతూ, ప్రతి ఇంటి ముంగిటకూ స్వచ్ఛమైన జలాలను చేర్చే బృహత్తర సంకల్పానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. కోట్లాది గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చే లక్ష్యంతో చేపట్టిన 'జల జీవన్ మిషన్ - అమరజీవి జలధార' కార్యక్రమాన్ని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు వేదికగా సోమవారం రాష్ట్రస్థాయిలో లాంఛనంగా ప్రారంభించను న్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పైలాన్‌ను ఆవిష్కరించి ప్రాజెక్టు పనులకు శంఖుస్థాపన చేయనున్నారు.

**కేవలం పథకం కాదు.. మహా యజ్ఞం!**

ఇది సాధారణ తాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, గ్రామీణ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే భారీ మౌలిక వసతుల నిర్మాణమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఏకంగా రూ.30,156.12 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 50,315 పనులను చేపట్టనున్నారు. కొండకోనలు, ఏజెన్సీ గ్రామాలు సహా మారుమూల ఆవాసాలన్నింటికీ శాశ్వత ప్రాతిపదికన పైపులైన్ల ద్వారా నీటిని అందించడమే ధ్యేయంగా ప్రణాళికలు రచించారు.

**రోజుకు తలసరి 55 లీటర్లు.. 'హర్ ఘర్ జల్'**

కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్‌ను 2028 డిసెంబరు వరకు పొడిగించిన నేపథ్యంలో, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ రోజుకు తలసరి 55 లీటర్ల మేర నాణ్యమైన తాగునీటిని అందించడమే పరమావధిగా పెట్టుకున్నారు.

ఇప్పటివరకు: రాష్ట్రంలో 61.60 లక్షల కుటుంబాలకు (సుమారు 65%) కుళాయి కనెక్షన్లు పూర్తయ్యాయి.

తాజా లక్ష్యం: మిగిలిన 24,601 ఆవాసాల్లోని 27.36 లక్షల కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు సమకూర్చనున్నారు. దీంతో సుమారు 3.27 కోట్ల మంది గ్రామీణ ప్రజలకు శాశ్వత రక్షిత జలం అందనుంది.

**రూ.30వేలకోట్లకు పైగా బడ్జెట్.. ఎక్కడెక్కడ ఎంతంటే?**

ఎస్‌వీఎస్, పునరుద్ధరణ పనులకు: రూ.9,068.94 కోట్లు
32 భారీ ఎంవీఎస్ ప్రాజెక్టులకు: రూ.19,462.39 కోట్లు
నాణ్యత పర్యవేక్షణ, ఇతర వ్యయాలు: రూ.1,624.79 కోట్లు
ప్రగతి: ఇప్పటివరకు రూ.5,587.01 కోట్ల వ్యయంతో 27,301 పనులు పూర్తవగా, మిగిలిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

**రిజర్వాయర్ల నుంచి పల్లె సీమలకు..**

హిరమండలం, పీఏబీఆర్, వెలుగోడు-ఓంకారం, ధవళేశ్వరం, తాండవ, ఏలేరు, గండికోట తదితర కీలక జలాశయాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు నీటిని తరలించేలా సమగ్ర గ్రిడ్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా రూ.10,320 కోట్లతో చేపట్టే 12 కీలక ఎంవీఎస్ ప్రాజెక్టుల ద్వారా 7,126 ఆవాసాల్లోని 88.68లక్షల జనాభాకు మేలు చేకూరనుంది. అలాగే రూ.3,297కోట్లతో 8,494 ఎస్‌వీఎస్ పనులను చేపట్టనున్నారు.

**77 వేల కిలోమీటర్ల పైపులైన్లు..**

1,426ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటిశుద్ధి కేంద్రాలు (డబ్ల్యూటీపీలు)
14,995 భారీ నీటి నిల్వ ట్యాంకులు (ఓహెచ్‌ఎస్ఆర్‌లు)
77,243 కిలోమీటర్ల మేర సుదీర్ఘ పైపులైన్ల నిర్మాణం.

**తీరనున్న మహిళల బిందె కష్టాలు**

మంచినీటి వసతి అందుబాటులోకి రావడంతో పల్లెల్లో మహిళలు, బాలికలు కిలోమీటర్ల కొద్దీ నడిచి నీళ్లు మోసే బిందె కష్టాలు శాశ్వతంగా తీరనున్నాయి. సమయం, శ్రమ ఆదా కావడంతో పాటు నీటి ద్వారా ప్రబలే వ్యాధులకు అడ్డుకట్ట పడి గ్రామీణ ఆరోగ్యం మెరుగుపడనుంది.

**ప్రొద్దుటూరులో పండుగ శోభ**

రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ప్రొద్దుటూరు వేదిక కావడంతో జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సభకు సీఎం, డిప్యూటీ సీఎంలతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. పల్లెసీమల సమగ్ర వికాసానికి 'అమరజీవి జలధార' ఒక చారిత్రక మైలురాయిగా నిలవనుందని అధికారులు పేర్కొంటున్నారు.

# ఉద్యోగం కోసం కాళ్లరిగేలా తిరగొద్దు.. మీరే పదిమందికి బాస్‌లవ్వండి!

## స్వశక్తిని నమ్ముకోండి.. చరిత్ర సృష్టించండి: జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు ఉద్బోధ





మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 4: చేతులు కట్టుకుని కొలువుల కోసం ఎదురుచూసే రోజులు పోయాయని, సొంత ఆలోచనలకు పదునుపెట్టి మీరే పదిమందికి బాస్‌లుగా ఎదగాలని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు యువతకు పిలుపునిచ్చారు. అవకాశాలు వాటంతట అవే రావని, మనమే వాటిని సృష్టించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. నందలూరు మండలం తిప్పాయపల్లెకు చెందిన యువ సోదరులు నరేష్, ప్రశాంత్‌లు రాజంపేట పట్టణంలో నూతనంగా ప్రారంభించిన 'టి.పి. లాండ్రీ అండ్ డ్రై క్లీనింగ్ సెంటర్'ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. పని ఏదైనా అందులో మన ప్రతిభ, అంకితభావం ఉంటే తిరుగులేని విజయం సాధించవచ్చని భరోసా ఇచ్చారు. స్వశక్తితో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన నరేష్-ప్రశాంత్ సోదరులు నేటి యువతరానికి నిలువెత్తు స్ఫూర్తి అని ప్రశంసించారు. నిరుద్యోగంతో కుంగిపోకుండా ఇలాంటి ధైర్యమైన ముందడుగులు వేస్తే సమాజం, నాయకత్వం ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యల్లటూరు శివరామ రాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మాజీ ఎంపీటీసీ రాములు పాల్గొని నూతన వ్యాపార నిర్వాహకులను అభినందించారు. ఈ వేడుకలో తిప్పాయపల్లె ప్రశాంత్, నరేష్‌లతో పాటు రుద్రరాజు, ప్రసాద్, వంశీ, కార్తీక్, హరి, మోహన్, కరిముల్లా, జగదీశ్, శ్రీకాంత్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్సీ బత్యాలను సత్కరించిన డాక్టర్ నవీన్ కుమార్

## రాజంపేట మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్న భేటీ

మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 4:
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులును మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ నవీన్ కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. రానున్న పురపాలక సంఘ ఎన్నికల్లో రాజంపేట మున్సిపల్ చైర్మన్ బరిలో ఉన్న డాక్టర్ నవీన్ కుమార్, సీనియర్ నేత బత్యాలతో భేటీ కావడం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇటీవల కాలంలో డాక్టర్ నవీన్ కుమార్ మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఓవైపు వార్డుల వారీగా పర్యటిస్తూ అన్ని వర్గాల ప్రజలతో ముఖాముఖి సమావేశమవుతూ వారి సమస్యలు తెలుసుకుంటు న్నారు. మరోవైపు పార్టీ రాష్ట్ర అధిష్టానంలోని ముఖ్య నేతలతో పాటు, జిల్లా స్థాయి సీనియర్ నాయకులను కలుస్తూ ఎన్నికల్లో సహకారాన్ని, ఆశీస్సులను కోరుతున్నారు. ప్రజలతో మమేకం కావడంలోనూ, పార్టీ సీనియర్ నేతల మద్దతు కూడగట్టడంలోనూ డాక్టర్ నవీన్ కుమార్ అందరికంటే ముందు వరుసలో దూసుకుపోతున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ.. పార్టీ సీనియర్ నాయకుల అనుభవాలు, మార్గదర్శకత్వం తనకు ఎంతో స్ఫూర్తినిస్తున్నా యని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పట్టణంలో దీర్ఘకాలికంగా పేరుకు పోయిన సమస్యలపై పూర్తి అవగాహన వచ్చిందన్నారు. రాజంపేటను అన్ని రంగాల్లో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, అందుకు అనుగుణంగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నట్లు ఆయన వివరించారు.

# కె.కె. చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన కోడూరు నియోజకవర్గ టిడిపి ముఖ్య నేతలు



రైల్వే కోడూరు, అక్టోబర్ 04, మనం న్యూస్ : రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు మంగళగిరిలోని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ట్రైనింగ్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కె.కె. చౌదరి ని మర్యాదపూర్వకంగా కలిశారు. గత వారంలో జరిగిన ఈ భేటీలో పలు ప్రాంతీయ, సాంఘికాభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు ను చైర్మన్ కె.కె. చౌదరి శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల టిడిపి సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని, చైర్మన్‌కు తమ మద్దతు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాచినేని విశ్వేశ్వర నాయుడు గడికోట సుబ్బరాయుడు,ముక్కర శంకరయ్య,చప్పిడి రమేష్ బాబు,యేదోటి సుబ్రహ్మణ్యం, బుంగటావుల రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కోడూరు నియోజకవర్గ



పరిధి టీడీపీపార్టీ బలోపేతం మరియు స్థానిక అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## శ్రీ ప్రత్యూష హై స్కూల్ లో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కోట సరళమ్మకు ఘన సన్మానం




పుల్లంపేట, అక్టోబర్ 4 మనం న్యూస్ ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్స వాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా తిరుపతిలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం లో పుల్లంపేట శ్రీప్రత్యూష హైస్కూల్కు చెందిన ఉపాధ్యా యురాలు కోటసరళమ్మను ఉత్తమ ఉపాధ్యా యురాలిగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ చేతుల మీదుగా కోట సరళమ్మకు బెస్ట్ టీచర్ అవార్డు అందజేసి సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆమె అందిస్తున్న సేవలు, విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, సత్యవేడు ఎమ్మెల్యే మురళీమోహన్, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. శ్రీ ప్రత్యూష హై స్కూల్ ఉపాధ్యాయురాలికి ప్రతిష్టాత్మకమైన బెస్ట్ టీచర్ అవార్డు లభించడం పట్ల పాఠశాల యాజమాన్యం, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కాసల భాను ప్రసాద్ ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. అలాగే ప్రిన్సిపాల్ రాజశేఖర్, హెడ్మాస్టర్ సుబ్బ నరసింహులు, ఇన్చార్జిలు రాధ, రవి ఉపాధ్యాయులు వాసు, కృష్ణ, రహిమాన్, మహబూబ్బీ, నాగలక్ష్మి, రజిని, సురేష్, ప్రసన్న, రెడ్డమ్మ, జ్యోతి, బాలాజీ బాబు తదితరులు కోట సరళమ్మను అభినందించారు. ఈ అవార్డు శ్రీ ప్రత్యూష హై స్కూల్కు, పాఠశాల ఉపాధ్యాయ బృందానికి గర్వకారణమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

## రాబోయే ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను డ్రోన్ ద్వారా పరిశీలించిన రేణిగుంట డీఎస్పీ



పుల్లంపేట అక్టోబర్ 4 (మనం న్యూస్)రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, ఈరోజు రేణిగుంట డీఎస్పీ శ్రీ వై. శ్రీనివాసరావు గారు, కోడూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. శ్రీనివాసులు గారితో కలిసి కోడూరు రూరల్ సర్కిల్ పరిధిలోని ఓబులవారిపల్లి, చిట్వేల్, పుల్లంపేట మండలాల్లోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను సందర్శించి, అక్కడ ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రహరీ గోడలు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వాహనాల రాకపోకలకు అనువైన మార్గాలు తదితర అంశాలను పరిశీలించారు. అలాగే, డ్రోన్ కెమెరాల సహాయంతో పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలను, రహదారులను, భద్రతాపరంగా కీలకమైన ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా డ్రోన్ నిఘా ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎస్ఐ వి. చిన్న రెడ్డెప్ప, చిట్వేల్ ఎస్ఐ ఎస్. వినోద్ కుమార్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సమయానుకూలంగా స్పందించి యువతి ప్రాణాలు కాపాడిన రైల్వే కోడూరు పోలీసులు



రైల్వేకోడూరు, అక్టోబర్ 04, మనంన్యూస్: డయల్-100కు వచ్చిన అత్యవసర సమాచారానికి తక్షణమే స్పందించిన రైల్వే కోడూరు పట్టణ పోలీసులు, రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను సమయానుకూలంగా కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం రైల్వే కోడూరు పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డుకు చెందిన షేక్ సారా (22) అనే మహిళకు భర్త సల్మా, ఒక కుమారుడు ఉన్నారు. కాగా, కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపానికి గురైన సారా, స్థానిక రైల్వే స్టేషన్ వద్దకు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్లు డయల్-100 ద్వారా పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే కోడూరు పట్టణ పోలీస్ సిబ్బంది అత్యంత వేగంగా స్పందించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైలు కింద పడబోతున్న సారాను సకాలంలో అడ్డుకుని సురక్షితంగా రక్షించారు. అనంతరం ఆమెను పోలీస్ స్టేషన్కు తరలించి, జీవితంపై నమ్మకం కలిగేలా కౌన్సెలింగ్ నిర్వహించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులను పిలిపించి, వారి సమక్షంలో మహిళను సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు పోలీసులు మాట్లాడుతూ జీవితంలో ఏవైనా సమస్యలు ఎదురైతే ఆత్మహత్య పరిష్కారం కాదని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉంటూ వెంటనే డయల్-100/112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఆపద సమయంలో సమాచారం ఇస్తే పోలీసులు తక్షణమే సహాయం అందిస్తారని తెలిపారు. సకాలంలో స్పందించి మహిళ ప్రాణాలు కాపాడిన పోలీస్ సిబ్బందిని పలువురు అభినందించారు.

# సి.యం.రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీలో ముక్కావరలక్ష్మమ్మ, ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్



పుల్లంపేట అక్టోబర్ 4 మనం న్యూస్ రైల్వే కోడూరు నియోజకవర్గం లోని పుల్లంపేట మండలంలో ఎం.ఎల్.ఎ అరవ శ్రీధర్,తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మమ్మ,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాపెర్ల.చంద్రశేఖర్ నాయుడు తో కలిసి ప్రజల వద్దకు వెళ్లి అనారోగ్యముతో ఆసుపత్రిపాలై ఎక్కువ డబ్బును ఖర్చుచేసి ఇబ్బంది పడుతున్నవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమవివరాలు టి.కమ్మపల్లి పంచాయతీలోని కమ్మపల్లి హరిజనవాడకు చెందినసత్యాల వెంకటనారాయణకు రూ. 27,000, బలగాల కుమార్ కు రూ. 32,376,ముమ్మినేని నారాయణమ్మకు రూ.69,553, పోలినేని సుబ్బరాయుడు నాయుడుకు రూ.40,983, ఎగువ రెడ్డిపల్లికి చెందిన పటం ప్రభావతికి రూ.21, 986, పటం చంగల్ రాయుడుకు రూ.77,797, కుప్పాల లావణ్యకు రూ.43,460, కొండేటి అనంతమ్మకు రూ.31,795, ఎగువ రెడ్డిపల్లి అరుంధతి వాడకు చెందిన రెడ్డి పాక వెంకటసుబ్బయ్యకు రూ.21,631రెడ్డిపల్లి పేటకు చెందిన నంద్యాల లక్ష్మీదేవికి రూ.21,125 రూపాయలు, అప్పయ్య రాజుపేటకు చెందిన నల్లపోతుల వెంకటేష్ కు రూ.47,887, షేక్ మహబూబ్ కాసు సాహెబ్ కు రూ.30,084 సీతారాంపేట కి చెందిన మలావత శేఖర్ కు రూ.20,600, పుల్లంపేట కు చెందిన తిరువీధులయానాదికిరూ.35,500,శ్రీరాములపేటకు చెందిన మైలమూరు పవిత్రకు రూ 20,000, గంగరాజు రమణమ్మకు రూ.55,166, అవసాని శ్రీనివాసరావుకు రూ.1,06,204, కేతరాజు పల్లికి చెందిన గంధం శెట్టి మోక్ష జ్ఞాన సింహకు,రూ.40,195 కేతవాండ్లపల్లికి చెందిన కీ.శే నందలూరు వెంకటసుబ్బమ్మకు రూ.1,34,117, ఉడుమువారిపల్లికి చెందిన కంబాల శంకరమ్మకు రూ.68,534, ప్రకాష్నగర్ కాలనీకి చెందిన మందపల్లి శ్రీనివాసులకు 24,201,పు త్తనవారిపల్లికి చెందిన పెనుభాల వెంకటసుబ్బమ్మకు రూ. 26,100 రూపాయల చొప్పున చెక్కుల రూపంలో ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి తన వంతు ఆర్థిక సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకు,డిప్యూటీ సీ.ఎం పవన్ కళ్యాణ్ కు,ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్కు, ముక్క రూపనందరెడ్డికు, ముక్కావరలక్ష్మికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు,కుప్పాల రామకృష్ణయ్య, మల్లికార్జున, కొండేటి చంగయ్య, మోడం ఈశ్వరయ్య, శివప్రసాద్, చరణ్,ఏఎంసి వైస్ చైర్మన్ చిన్నం శివయ్య, భీమిశెట్టి నారాయణ,పోలు ప్రేమ కుమార్, నరసాపురం సుబ్బన్న,అనపాలచంద్ర, లగడి సుబ్రహ్మణ్యం రాజు, బోడ వెంకటరమణ పోలి రామచంద్రారెడ్డి, నారాయణ నాయుడు,ఆదినారాయణ రెడ్డి, రామచంద్రారెడ్డి, దిగదారి మురళి, శంకర,కుమార్, జంధ్యం సుబ్రహ్మణ్యం, కంబాల రాజకుమార్,సుధాకర్ రెడ్డి,సిద్దారెడ్డి మరియు ఎన్.డి.ఏ కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,

# సిల్వర్ బెల్స్ ఉపాధ్యాయురాలు జోగి భారతికి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు



రైల్వే కోడూరు, అక్టోబర్ 04, మనం న్యూస్ ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (అపూస్మా) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో స్థానిక సిల్వర్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఉపాధ్యాయురాలు శ్రీమతి జోగి భారతి ప్రతిష్ఠాత్మకమైన "ఉత్తమ ఉపాధ్యాయురాలు" అవార్డును అందుకున్నారు.

**20 ఏళ్ల అంకితభావానికి తగిన గుర్తింపు**

శ్రీమతి జోగి భారతి గత 20 సంవత్సరాలుగా సిల్వర్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం, వారి సర్వాంగీణ అభ్యున్నతి కోసం ఆమె నిరంతరం కృషి చేస్తున్నారు. విద్యారంగంలో ఆమె కనబరుస్తున్న అంకితభావం, నిబద్ధత మరియు నిస్వార్థ సేవలకు గుర్తింపుగా అపూస్మా కమిటీ ఈ పురస్కారానికి ఆమెను ఎంపిక చేసింది.

**ముఖ్య అతిథుల చేతుల మీదుగా పురస్కార ప్రదానం**

తిరుపతిలో వైభవంగా జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కేవిఎన్ కుమార్ మరియు తిరుపతి మాజీ శాసనసభ్యురాలు శ్రీమతి సుగుణమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉపాధ్యాయురాలిగా శ్రీమతి జోగి భారతి అందించిన విశేష సేవలను కొనియాడుతూ, వారి చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును ఆమెకు అందజేశారు.

**యాజమాన్యం హృదయపూర్వక అభినందనలు**

శ్రీమతి జోగి భారతికి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు లభించడం పట్ల సిల్వర్ బెల్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎంవి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా పాఠశాల పురోగతిలోనూ, వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలోనూ ఆమె పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు సంస్థ యాజమాన్యం, సహచర ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

## పేదల వద్దకే ఉచిత వైద్యం



ఓబులవారిపల్లి, అక్టోబర్ 04, మనం న్యూస్: "పేదల వద్దకే వైద్యం" అనే లక్ష్యం తో శ్రీ సాయి హాస్పిటల్ సామాజిక సేవలో ముందంజలో ఉంది. హాస్పిటల్ అధినేత డాక్టర్ పసులేటి శ్యామ్ కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో ఒబులవారి పల్లి మండలం బొమ్మవరం గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ మెగా వైద్య శిబిరంలో సుమారు 120 మంది రోగులు పాల్గొని వైద్య సేవలను పొందారు. శిబిరానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా బిపి, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం వారికి అవసరమైన మందులను కూడా పూర్తిగా ఉచితంగా పంపిణీ చేసినట్లు డాక్టర్ శ్యామ్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ పసులేటి శ్యామ్ కృష్ణ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇందులో భాగంగానే రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో ప్రతి నెల మొదటి వారం లో ఇటువంటి ఉచిత మెగా వైద్య శిబిరాలను క్రమం తప్ప కుండా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న బొమ్మవరం గ్రామ ప్రజలు డాక్టర్ శ్యామ్ కృష్ణ కుమార్ మరియు ఆయన బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## సిద్ధవటం బ్రిడ్జి పై రోడ్డు ప్రమాదం: ఇరువురికి గాయాలు



సిద్ధవటం, అక్టోబర్ 4 మనంన్యూస్: సిద్ధవటం బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి మండల కేంద్రమైన సిద్ధవటం హై లెవెల్ వంతెన పై, ఆదివారం రాత్రి భాకరాపేట నుండి బద్వేల్ కు వెళ్తున్న మినీ లారీ వరిగడ్డి తీసుకెళుతున్న ట్రాక్టర్లు ఢీ కొట్టి బ్రిడ్జిపై ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఎస్ రాజంపేట గ్రామానికి చెందిన వెంకటాద్రి, భవనాసి శ్రీను అనే యువకులకు మినీ లారీ ఢీకొట్టడంతో గాయాలయ్యాయి స్థానికులు వెంటనే మెరుగైన వైద్య చికిత్సల కోసం 108 వాహనంలో కడప రిమ్స్ తరలించారు. జరిగిన సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.



## సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు

చిట్వేలి అక్టోబర్ 4 మనంన్యూస్: రాబోయే ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను డ్రోన్ ద్వారా పరిశీలించిన రేణిగుంట డీఎస్పీ వై.శ్రీనివాసరావు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆదివారం రేణిగుంట డీఎస్పీ వై.శ్రీనివాసరావు, కోడూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.శ్రీనివాసులుతో కలిసి రైల్వేకోడూరు రూరల్ సర్కిల్ పరిధిలోని ఓబులవారిపల్లి, చిట్వేలీ, పుల్లంపేట మండలాల్లోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను సందర్శించి, అక్కడ ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రహరీ గోడలు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వాహనాల రాకపోకలకు అనువైన మార్గాలు తదితర అంశాలను పరిశీలించారు. అలాగే డ్రోన్ కెమెరాల సహాయంతో పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలను, రహదారులను, భద్రతాపరంగా కీలకమైన ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా డ్రోన్ నిఘా ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎస్ఐ వి.చిన్న రెడ్డెప్ప, చిట్వేలీ ఎస్ఐ ఎస్.వినోద్ కుమార్ పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.